
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల
3★★★ జిల్లా వార్తలు
సోమవారం 19 ఆగస్టు 2024

బీఆర్‌ఎస్‌తో పొత్తు ఉండదు
కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ 5లో..

6లో.. సర్వాయి పాపన్న జీవితం
నేటి తరానికి స్ఫూర్తిదాయకం

సోదర ప్రేమకు మమతానుబంధం





● యజ్ఞోపవీతం పరమ పవిత్రం... ● నేడు రాఖీ పండుగ... నూలు పౌర్ణమి

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

మనుషుల్లో ప్రేమ, ఆప్యాయత, మమతలను పరమళింపజేయడానికి వచ్చిన పండుగ రక్షాబంధన్. జిల్లా వ్యాప్తంగా సోమవారం అతివలు తమ సోదరులకు రాఖీ కట్టే రక్షాబంధన్‌ను జరుపుకోవడానికి సిద్ధమయ్యారు. ఒకప్పుడు రాఖీ పండుగ ఉత్తరాదిన ఎక్కువగా జరుపుకునే వారు. క్రమేణా రాఖీ పండుగ అన్నా చెల్లల్ల అనురాగానికి ప్రతీకగా మారి జాతీయ పండుగలాగా దేశంలోని అన్ని మారుమూల గ్రామాల్లో సైతం రాఖీ పండుగను జరుపుకుంటున్నారు. రక్షాబంధన్ త్రేతాయుగ కాలం నుండి మహ్మద్ గోరీ 12వ శాతబ్ద మధ్య యుగం వరకు జరిగిన ఎన్నో గాథలకు రక్షాబంధన్ పాత్ర కూడా ఉన్నట్లుగా చెప్తున్నాయి.తెలంగాణ, ఆంధ్రాలో రాఖీగా పిలిస్తే.... మహారాష్ట్ర, గోవా, గుజారాత్‌లో నార్యల్ పూర్ణిమ, ఒరిస్సాలో బ్రహ్మ పూర్ణిమ, ఉత్తరాఖండ్‌లో జనోపున్య, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, బీహార్‌లలో ఖజరీ పూర్ణిమగా పిలుస్తూ పండుగలు జరుపుకుంటారు.

రాఖీల కొనుగోళ్ల సందడి...

కుటుంబంలోని కష్టసుఖాల్లో తోడుండే అన్నదమ్ములే కాకుండా నేస్తాలంతా సోదరులుగా ఆడపడుచులు రాఖీలు కంటే వేళయింది. సోమవారం రాఖీ పండుగ కావడంతో దూరంగా ఉండే సోదరుల ఇళ్లకు ముందే వెళ్లారు. ఈ పండుగ కోసం విభిన్న డిజైన్లలో ఉన్న రాఖీల కొనుగోళ్లతో సిరిసిల్ల మార్కెట్‌తో పాటు జిల్లా వ్యాప్తంగా సందడిగా మారింది. మార్కెట్లో చిన్నారులకు స్పైడర్‌మ్యాన్, ఛోటా భీమ్, బెన్‌టెన్, డోరెమాన్, జెర్రీ, హనుమాన్ లాంటి వెరైటీ కార్టూన్లు, యువత కోసం ఫ్యాన్సీ స్టోన్స్ రాఖీలు వచ్చాయి. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో రాఖీల కోసం ప్రత్యేకమైన దుకాణాలు వెలిశాయి. పశ్చిమ బెంగాల్, గుజరాత్, మహారాష్ట్రల నుంచి వివిధ రకాల రాఖీలను తీసుకువచ్చి అమ్మకాలు సాగిస్తున్నారు. చిరు వ్యాపారులు తోపుడు బండ్లపై రాఖీలను పెట్టుకొని కార్మిక వాడల్లో సైతం అమ్మకాలు సాగిస్తున్నారు. ఈ సారి రాఖీలు అనేక డిజైన్లలో అకట్టుకన్నాయి. రుద్రక్ష, స్టోన్ రాఖీలు ప్రత్యేకంగా నిలుస్తున్నాయి. కుందన్‌ల మెరుపులు, జరీతోపాటు స్పంజ్‌తో తయారు చేసిన రాఖీలు మార్కెట్లోకి వచ్చాయి. పాత కాలంలో అతిపెద్దగా ఉండే రాఖీలు కట్టుకునే వారు. మళ్లీ ఆ ట్రెండ్ వచ్చింది. మార్కెట్లో 50 రూపాయల నుంచి 100 రూపాయల విలువ చేసే పెద్ద రాఖీలు అమ్మకాలు జరుగుతున్నాయి. చిన్నపిల్లలను ఆకర్షించే విధంగా 10 రూపాయల నుంచి 30 రూపాయల వరకు క్రికెట్, మిక్కీమౌస్, స్పైడర్ మ్యాన్, డిజైన్లలో కూడా రాఖీలు వచ్చాయి. స్టోన్ రాఖీలు 25 రూపాయల నుంచి 300 రూపాయల వరకు లభిస్తున్నాయి.

జంధ్యాల పూర్ణిమ....



శ్రావణ పూర్ణిమనే జంధ్యాల పూర్ణిమ (నూలు పౌర్ణమి)గా... జరుపుకుంటారు. యజ్ఞోపవీతాన్ని శ్రావణ పూర్ణిమ రోజు మార్చుకుంటారు. సంవత్సరం మధ్యలో మార్చుకోవాల్సిన అవసరం ఉన్నా శ్రావణ పూర్ణిమ నాడు విధిగా నూతన ధారణ చేస్తారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా సోమవారం అక్కా చెల్లెళ్లు, అన్నదమ్ములకు వారి క్షేమాన్ని కోరుతూ రక్షగా రాఖీ కట్టే పండుగను జరుపుకోవడానికి సిద్ధమవుతున్నారు.

శ్రావణ పూర్ణిమ రోజు రక్ష కట్టి వారు కోరిన వరాలను పొందే పవిత్ర దినంగా కూడా జరుపుకుంటారు. ఇదే సందర్భంలో ఉపనయం అయిన బ్రహ్మణ, వైశ్య, పద్మశాలీ ఇతర కులాల వారు యజ్ఞోపవీతాలను మార్చుకుంటారు. పాతవాటి స్థానంలో కొత్తవి ధరిస్తారు. నూలు పౌర్ణమి సందర్భంగా పద్మశాలీలు మార్కండేయ స్వామి రథోత్సవాన్ని నిర్వహిస్తారు. పద్మశాలీలు ఉదయమే జంధ్యాలను మార్చుకొని సాయంత్రం వేళ మార్కండేయ స్వామి రథోత్సవాన్ని నిర్వహిస్తారు. ఎడ్లబండిపై లేదా ట్రాక్టర్‌పై మగ్గాన్ని నిలిపి బట్టను నేస్తూ పట్టణ పురవీధుల్లో రథాన్ని నడిపిస్తారు. రథోత్సవంలో నేసిన బట్టను మార్కండేయునికి సమర్పించుకుంటారు. అందుకే పద్మశాలీలు జంధ్యాల పూర్ణిమను నూలు పూర్ణిమగా కూడా జరుపుకుంటారు. జంధ్యాలను యజ్ఞోపవీతంగా పిలుస్తున్న దాన్ని పరిశీలిస్తే యజ్ఞోపవీతం ద్వారా పరమాత్మను చేరుటకు చేసే పరమ పవిత్రమైన ప్రక్రియ యజ్ఞంగా భావిస్తారు.

ఎవరెవరికి ఎన్ని పోగులు...

యజ్ఞోపవీతధారణ ఎంతో గొప్పగా భావిస్తారు. వివాహం కాని వటువులకు యజ్ఞోపవీత ఒక పోగుచాలు. గృహస్థులకు విదురులకు మూడూ పోగులు చాలు, కొందరు ఐదు పోగులు ధరిస్తారు. యజ్ఞోపవీతం మూడు భాగాలుగా తయారు చేస్తారు. ఇందులో ఒక్కొక్క ముడిలో మూడు ధారాలతో మొత్తం తొమ్మిది ధారాలు ఉంటాయి. 96 బెత్తల పొడవు ఉంటుంది. ఒక్కొక్క దారం వెనుక ఒక్కొక్క నేపథ్యం ఉంది. మొదటి పోగు ధారం ఓంకారం, బ్రహ్మకు నిలయంగా ఉంటే, రెండవ పోగు తేజస్సు అగ్ని, మూడవ పోగు అనంతునికి, నాలుగవ పోగు చంద్రునికి, చల్లాని కాంతినిచ్చేదిగా, ఐదవ పోగు ప్రజాపతికి, ఆరవ పోగు పాలించే స్వభావం, ఏడవ పోగు వాయుదేవుడు, శుభ్రత, ఎనిమిదో పోగు సూర్య నిలయం, ప్రతాపం, తొమ్మిదవ పోగు అందరు దేవతలు సమదృష్టిని ఇచ్చేదిగా ఉంటుందని వేదాలు చెబుతున్నాయి. అందుకే యజ్ఞోపవితాన్ని శ్రావణ పూర్ణిమ రోజు మార్చుకోవడం సనాతనంగా వస్తోంది. భారతీయ ధర్మ నిర్మాణ వ్యవస్థలో యజ్ఞోపవీతం లేనిదే ఏ ఇంట్లో కూడా శుభ కార్యాలు, పూజలు జరుపుకోరు.

రాఖీ నేపథ్యం...

క్రీస్తుపూర్వం 326లో అలెగ్జాండర్ భారతదేశంలోని పురుషోత్తముడి రాజ్యంపై దండెత్తాడు. ఆ సమయంలో అలెగ్జాండర్ ప్రేయసి రుక్సానా పురుషోత్తముడికి రక్షాబంధన్ కడుతుంది. ఆ కంకణానికి విలువనిచ్చిన పురుషోత్తముడు యుద్ధంలో చేతికి చిక్కిన అలెగ్జాండర్‌ను ప్రాణాలతో వదిలేస్తాడు. ఆ తరువాత పురుషోత్తముడిని అలెగ్జాండర్ బంధిస్తాడు. ఆ తరువాత సభా భవనంలో పురుషోత్తముడు బెదురులేకుండా ఒక రాజు మరో రాజును ఎలా గౌరవిస్తారో అలాగే అంటూ రుక్సానా కట్టిన రక్షాబంధనంతోనే తాను ప్రాణాలతో ఉన్నానని తెలుసుకున్న అలెగ్జాండర్ పురుషోత్తమున్ని కీర్తించి వదిలేస్తాడు. మరో చారిత్రక నేపథ్యం ప్రకారం దేవతలు, రాక్షసుల మధ్య యుద్ధం జరిగినప్పుడు దేవతలకు నిస్సత్తువ ఆవహించినప్పుడు ఇంద్రుడి భార్య శశిదేవి బృహస్పతి సలహా మేరకు ఒక రక్షణు ఇంద్రుడికి కడుతుంది. ఆ యుద్ధంలో ఇంద్రుడు రాక్షసుల్ని ఓడిస్తాడు. అలా పౌర్ణమి రోజు రక్షగా చేతికి తోరం కట్టుకోవడం ఆచారంగా మారిందని చెప్పుకుంటారు. రాజపుత్రులు దీనికి ఎంతో ప్రాధాన్యాన్ని ఇస్తారు. మరో వైపు మనుషుల్లో ప్రేమ, ఆప్యాయత, మమతను పెంచడం కోసం గురుదేవ్, రవీంద్రనాథ్‌ఠాగూర్ తన శాంతినికేతన్‌లో రక్షా బంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

రక్షాబంధన్ ధైర్యాన్నిస్తుంది: పులి జ్యోతి

మహిళలకు ఆధ్యాత్మికంగా నోములు, వ్రతాలకు శ్రావణమాసం ముఖ్యమైంది. రక్షాబంధన్ తోబుట్టువులు అండగా ఉన్నారనే ధైర్యాన్నిస్తుంది. సోదరులకు రక్ష కట్టి ఎప్పుడూ సుఖ సంతోషాలతో ఉండాలని సోదరి మనస్ఫూర్తిగా కోరుకుంటుంది.



సోదరులకు శుభం కలగాలని..: బుస్స కావ్య

రాఖీ పండుగ తమ సోదరులకు శుభం కలగాలని కోరుకుంటాం. రక్ష బంధానికి ఇది ప్రతీకగా నిలుస్తుంది. ఆయురారోగ్యాలను, పెంచడమే కాకుండా కుటుంబ సభ్యులందరు ఒకచోట చేరుకోవడానికి దోహద పడుతుంది.



శ్రావణంలో ఇష్టమైంది రక్షాబంధన్ మాణిక్యరావు సంగీత

శ్రావణమాసమంతా పండుగలతో సందడిగా ఉన్నా రక్షాబంధన్ అంటేనే ఇష్టం. సోదర భావాన్ని పెంచడమే కాకుండా ఆత్మీయత, అనురాగాలకు దర్పణం పడుతుంది.



మనుషుల్లో ఆప్యాయతను పెంచుతుంది గుండ లహోరి

మనుషుల్లో రాఖీ పండుగ ప్రేమను పెంచుతుంది. ఆప్యాయత మమతను పరమళింప చేయడం కోసం ఈ రక్షాబంధనం రక్త సంబంధికుల మధ్య ఆనందాన్ని నింపుతుంది.



జిల్లా కేంద్రంలో కుండపోత వర్షం



జలమయమైన రోడ్లు

సిరిసిల్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఉరుములు, మెరుపులతో సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కుండపోతగా వర్షం కురిసింది. ఆదివారం ఉదయం వేళల్లో ఉక్కపోతతో జనం సతమతమయ్యారు. రాత్రి దాదాపు అరగంట పాటు వర్షం కురవడంతో సిరిసిల్లలోని చేనేత చౌక్, సంజీవయ్యనగర్, బీవైనగర్, సుందరయ్యనగర్, గణేష్‌నగర్, పద్మనగర్, శాంతినగర్, శ్రీనగర్ కాలనీ, ప్రాంతాల్లో రోడ్లు జలమయంగా మారాయి.

వైభవోపేతంగా ముగిసిన చండీ మహాయాగం

- చివరి రోజు భారీగా తరలివచ్చిన భక్తులు



చండీయాగంలో పాల్గొన్న దంపతులు

సిరిసిల్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): లలితాపరమేశ్వరి లక్ష్మీనారాయణ ఉమామహేశ్వర సహిత శివభక్త మార్కండేయస్వామి ఆలయంలో ఎంతో వైభవోపేతంగా నాలుగు రోజుల పాటు చండీ మహాయాగం నిర్వహించారు. చివరిరోజు ఆదివారం చండీ మహాయాగానికి, చండీమాత దర్శనానికి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. చండీయాగాన్ని మళయాళస్వామి లక్ష్మీనారాయణ ఆశ్రమం పరమాత్మనంద గిరిస్వామి పర్యవేక్షణలో నిర్వహించారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కే తారకరామారావులతో పాటు ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు చండీమాతను దర్శించుకున్నారు. చండీయాగం ముగింపు సందర్భంగా మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. యాగంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ మంచె శ్రీనివాస్, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, పత్తిపాక సురేష్, మండల సత్యం, గాజుల బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎస్జీటీలకు న్యాయం చేయాలి

ఇల్లంతకుంట, ఆగస్టు 18: ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల ప్రమోషన్లలో ఎస్‌జీటీలకు అవకాశం ఇచ్చి న్యాయం చేయాలని ఎస్టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి రేవోజు సదానందం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలలో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలని కోరారు. ఎస్‌జీటీలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

తంగళ్లపల్లి, ఆగస్టు 18: మండలంలోని మండేపల్లిలో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్, గ్రామ శాఖ అధ్యక్షుడు ఆసాని మహిపాల్ రెడ్డి, జిల్లా ఫిషరీస్ ప్రధాన కార్యదర్శి చెన్నమనేని ప్రశాంత్, బుస్స లింగం తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు

చందుర్తి, ఆగస్టు 18: మండల కేంద్రంలోని మహాలక్ష్మీ ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా మహాలక్ష్మి అమ్మవారికి ఆదివారం గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా శ్రావణ మాసంలో అన్నదాన కార్యక్రమాన్ని ఆనవాయితీగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో ఛైర్మన్ తిప్పని శ్రీనివాస్, అలయ కమిటి ఛైర్మన్ బాశెట్టి భాస్కర్, చిలముల గోపాల స్వామి ఆవిరనేని సతీష్‌రావు, భాశెట్టి మొగిలియ్య, మెడిశెట్టి రాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతాం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ, ఆగస్టు 18: ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని సుభాష్‌నగర్ కూడలిలో స్వాతంత్ర సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఆదివారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ పట్టణంలోని కూడళ్లకు కొత్త శోభ తీసుకువ చ్చే విధంగా ప్రభుత్వం, మున్సిపల్ పాలకవర్గం ముందుకు పోతున్నదన్నారు. భక్తులు తమ ఆరాధ్య దైవంగా భావించే రాజన్న క్షేత్రం కొలువైన వేములవాడ పట్టణాన్ని ఆధ్యాత్మికత ఉట్టిపడేలా తీర్చిదిద్దుతామని అన్నారు. పట్టణంలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా ఇటీవలే మున్సిపల్ పార్కును అందుబాటులోకి తీసుకువచ్చామని, అంబేద్కర్ చౌరస్తా అభివృద్ధికి భూమి పూజ చేసుకున్నామన్నారు. దేవాలయం దగ్గర మరో పార్క్ నిర్మాణం కాబోతోందని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకపాత్ర పోషించి తెల్ల దొరలను దేశం నుంచి తరిమి కొట్టిన గొప్ప వీరుడు సుభాష్ చంద్రబోస్ అని, సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం గొప్ప విషయం అన్నారు. వేములవాడ పట్టణంలో సుభాష్ నగర్‌కు ఒక ప్రత్యేకత ఉందనీ, మొదటి నుంచి వేములవాడ పట్టణ అభివృద్ధిలో సుభాష్‌నగర్ ప్రాంత ప్రజల పాత్ర ఉందని అన్నారు. కులమతాలకు అతీతంగా సోదర భావంతో వెల్లివిరిసే చైతన్యవంతమైన యువత సుభాష్‌నగర్ లో ఉన్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ రామతీర్థపు మాధవి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, తదితరులు

● ప్రభుత్వ విప్‌ను కలిసిన అంబేద్కర్ సంఘ నాయకులు

ఇల్లంతకుంట: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను మండలంలోని కందికట్కూర్ గ్రామ అంబేద్కర్ సంఘ నాయకులు ఆదివారం కలిశారు. ఈనెల 25న కందికట్కూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి రావలసినగా ఆహ్వానించారు. అందుకు ప్రభుత్వ విప్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సావనపెల్లి రాకేష్, మాజీ సర్పంచ్ బిగుళ్ళ వనితతిరుపతి, గ్రామశాఖ అధ్యక్షుడు బిగుళ్ల కృష్ణ, నాయకులు సావనపెల్లి పర్శరాం, మహంకాళి మల్లికార్జున్, బిగుళ్ళ పర్శరాం తదితరులు ఉన్నారు.

సర్వాయి పాపన్న ఆశయాలను కొనసాగిద్దాం

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారకరామారావు

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 18: సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలను కొనసాగించేందుకు ప్రజలంతా ముందుకు రావాలని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే తారకరామారావు కోరారు. సిరిసిల్లలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను ఆదివారం చేపట్టగా కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. బైపాస్ రోడ్డులో ఉన్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లా డుతూ రాజ్యాధికారం కోసం సర్వాయి పాపన్న పాటుపడ్డ మహానీయుడని అన్నారు. తాటిచెట్లపై పన్నులను తీసివేసి గౌడన్నల కులవృత్తిని కాపాడింది కేసీఆర్ ప్రభుత్వమన్నారు. గౌడ కులస్తులకు 15 శాతం రిజర్వేషన్ కల్పించి మద్యంషాపులను కేటాయించామని అన్నారు. గత ప్రభుత్వంలో నీరాను ప్రోత్సహించి ట్యాంక్‌బండ్‌పై నీరా కేఫ్ నెలకొల్పామన్నారు. గత ప్రభుత్వంలో వెయ్యికి పైగా గురుకులాలను ఏర్పాటు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు చెందిన 6.50 లక్షల మంది పిల్లలకు నాణ్యమైన విద్యను అందించామని అన్నారు. మహానీ యుడు సర్వాయి పాపన్న విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయడంతో పాటు, జనగామ జిల్లాకు అతని పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. సందర్భంగా అన్నా రామన్నా... అనాటి నవ్వులు ఏవన్నా... రామన్నా నా పింఛన్ అస్తలేదు అన్నా అంటూ కూలీ మల్లేశం పాటలు పాడుతూ తనకు పింఛన్‌రావడం లేదంటూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను అడగడం అందరిని నవ్వుల్లో ముంచింది. కేటీఆర్ నవ్వుతూ రేవంత్‌రెడ్డిని అడుగు అంటూ చమత్కారంగా మాట్లాడాడు. కార్యక్రమంలో నాఫ్‌స్కాబ్ ఛైర్మన్ కొండూరు రవీందర్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట అగయ్య, నాయకులు బొల్లి రామ్మోహన్, మ్యాన రవి, గజభీంకార్ రాజన్న, గౌడ సంఘం నాయకులు బుర్ర నారాయణ గౌడ్, పరకాల అంజయ్య, బాలసాని అంజయ్యగౌడ్ పాల్గొన్నారు.



సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న కేటీఆర్

● మార్కండేయ ఆలయ పునర్‌నిర్మాణానికి సహకారం...

సిరిసిల్లలో పునర్ నిర్మాణం చేస్తున్న మార్కండేయ ఆలయానికి పూర్తి సహాయ, సహకారాలు అందిస్తానని సిరిసిల్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని మార్కండేయ స్వామి ఆలయంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన మహాచండీయాగంలో మాజీ మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీతో పాటు పద్మశాలి సంఘం నాయకులు, పద్మ పూజారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చండీయాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కేటీఆర్‌ను రుత్వికులు ఆశీర్వదించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్స న్ జిందం కళ, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్ర పాణి, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ మంచె శ్రీనివాస్, మాజీ టెక్స్‌టైల్ కార్పొరేషన్ ఛైర్మన్ గూడూరి ప్రవీణ్, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మహా చండీయాగంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి కేటీఆర్

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

- నీళ్లు వేడి చేసేందుకు హీటర్ పెడుతుండగా ప్రమాదం

మేడిపల్లి, ఆగస్టు 18: కట్లకుంట గ్రామంలో స్నానానికి నీళ్ల వేడి చేసేందుకు హీటర్ పెట్టే క్రమంలో విద్యుదాఘాతానికి గురై గడ్డం మాలకొండయ్య(48) అనే వ్యక్తి మృతి చెందాడు. నెల్లూరు జిల్లాకు చెందిన మాలకొండయ్య ఐదు నెలలుగా గ్రామంలో తాపీ పని చేస్తున్నాడు. ఆదివారం స్నానం చేసేందుకు నీళ్ల పెడుతూ విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్యాంరాజ్ తెలిపారు.

శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

- కాకతీయ కాలువకు పెరిగిన నీటి విడుదల



శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ఉన్న నీటి నిల్వలు

జగిత్యాల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో రావడం ఆదివారం కొనసాగింది. ఎస్సారెస్పీలోకి 8,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్ర స్తుతం 49.117 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు 5,453 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

లారీ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

తిమ్మాపూర్, ఆగస్టు 18: మండలంలోని ఇందిరానగర్ వద్ద రాజీవ్ రహదారిపై ఆదివారం సాయంత్రం ముందుగా వెళుతున్న ద్విచక్ర వాహనదారుడిని లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌కి చెందిన షేక్ ఫారూఖ్ కొడిగుడ్లు అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటు న్నాడు. ఆదివారం ద్విచక్ర వాహనంపై కొడిగుడ్లను తీసుకొని ఇంటికి వెళుతున్నాడు. ఆ సమయంలో మండలంలోని ఇందిరానరగ్ గ్రామం సమీపంలో రాజీవ్ రహదారిపై హైదారాబా ద్ నుంచి కరీంనగర్‌కు అతివేగంగా వచ్చిన ఓ లారీ ఫారూఖ్ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. కింద పడిన అతడికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం చేసిన లారీ డ్రైవర్ వాహనం ఆప కుండా పారిపోయేందుకు యత్నించాడు. స్థానిక యువకులు లారీని వెంబడించి పట్టుకున్నారు. ఈ ప్రమాదంలో ఫారూఖ్‌కు కాళ్లు, చేతులు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని చేరుకొని ఫారూఖ్‌ను 108లో కరీంనగర్ తరలించారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

జగిత్యాలరూరల్, ఆగస్టు 18: జగిత్యాల పట్టణంలోని నూతన బస్టాండ్ లో ఆదివారం గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని జగిత్యాల పట్టణ ఎస్సై ఇంద్రకరణ్‌రెడ్డి గుర్తించారు. జగిత్యాల పట్టణ కొత్తబస్టాండ్ లో ఓ మహిళ అపస్మారక స్థితిలో పడిఉందని పోలీసులకు స మాచారం అందింది. ఈమేరకు సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని మహిళను పరీ శీలించి చూడగా మహిళ మృతిచెంది ఉన్నది. మహిళ గులాబీ కలర్ స్వెటర్ ధరించి బ్రౌన్ కలర్‌చీర ధరించి ఉందని పట్టణ పోలీసులు తెలిపారు. సుమారు 40 ఏళ్లు ఉంటుందని తెలిపారు. మహిళ మృతదేహాన్ని జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మా ర్చురీగదిలో భద్రపరిచినట్లు ఎస్సై ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. మహిళ ఆచూకి ఎవరికైన తెలిస్తే జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లిన కారు

జగిత్యాలరూరల్, ఆగస్టు 18: జగిత్యాల జిల్లా కేంద్రంలోని గోవిందుపల్లి వీధి వద్ద ఆదివారం రాజీవ్‌బైపాస్‌మీదుగా ప్రయాణిస్తున్నకారు అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లింది. ధర్మపురివైపు నుంచి జగిత్యాల వైపు కారులో వెళ్తుండగా ఒక్కసారిగా బ్రేక్‌పై పడడంతో కారు అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ఈప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు.

బీఆర్ఎస్‌తో పొత్తు ఉండదు

- కేసీఆర్, కేటీఆర్ అంటేనే జనం రాళ్లతో కొట్టే పరిస్థితి - కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 18: అవినీతి పార్టీగా ప్రజల్లో ముద్రపడిన బీఆర్ఎస్ పార్టీతో పొత్తు పెట్టుకోవాల్సిన ఖర్మ భారతీయ జనతా పార్టీకి లేదని, ప్రస్తుతం తెలంగాణలో కేసీఆర్, కేటీఆర్ పేరు ఎత్తితేనే జనం రాళ్లతో కొట్టే పరిస్థితి ఏర్పడిందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలో మార్కండేయ ఆలయంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన మహా చండీయాగంలో బండి సంజయ్‌కుమార్ ఆదివారం పాల్గొనగా ఆలయ కమిటీ, పద్మశాలీ సంఘం నాయకులు, పద్మ పూజారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అవరణంలో జరుగుతున్న యాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన నగల షోరూంను బండి సంజయ్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బండి సంజయ్‌కుమార్ మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలకు అలవికాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రుణమాఫీతో పాటు ఆరు గ్యారంటీలపై చర్చను పక్కదారి పట్టించేందుకు విలీన డ్రామాలు ఆడుతున్నారన్నారు. రుణమాఫీ కానీ రైతులు కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మలను దహనం చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసి డ్రామాలు ఆడుతున్నాయని ఆరోపించారు. రుణమాఫీపై కాంగ్రెస్ మాట తప్పిందని 64 లక్షల మంది రుణాలు తీసుకుంటే 24 లక్షల మందికే మాఫీ చేయడం ఏమిటని అన్నారు. రైతులందరికి రుణమాఫీ చేస్తామని ఇచ్చిన హామీలు ప్రకారం ఎన్నికల్లో రూ 40 వేల కోట్ల రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించి బడ్జెట్‌లో రూ 26 వేల కోట్లు కేటాయించి చివరకు రూ 17 వేల కోట్లు మాత్రమే మాఫీ చేశారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ లక్ష రుణమాఫీ చేస్తామని రైతులను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ కూడా రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసినట్లు చెబుతూ మోసం చేస్తుందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే రైతులకు బ్యాంకుల నుంచి క్లియరెన్స్ సర్టిఫికేట్‌లను ఇప్పించాలని అన్నారు. రుణాలు తీసుకున్న రైతులకు క్లియరెన్స్ సర్టిఫికేట్‌లు రాకుంటే భవిష్యత్తులో ఎలాంటి రుణాలు పొందలేదనే విషయాన్ని గుర్తు చేసుకోవాలని అన్నారు. కల్యాణలక్ష్మి పథకానికి లక్ష రూపాయలు, తులం బంగారంతో సహా ఆరు గ్యారంటీలు ఇప్పటికీ అమలు చేయడం లేదన్నారు. 30 వేల ఉద్యోగాలని చెప్పి కేవలం 12 వేల ఉద్యోగాలు మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అద్దాల మేడలో కూర్చొని ప్రజలకు అన్నీ చేశామని అనుకుంటుందని అన్నారు. రైతు భరోసా, బోనస్, రుణమాఫీ చేస్తామని చేయలేదనే ప్రజలు తెలుసుకున్నారని అన్నారు. రైతులు అమాయకులు కాదని, వారు దుఖంలో ఉన్నారని వారికి భరోసా కల్పించడంతో పాటు ఇచ్చిన హామీలు నేరవేర్చాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మోసపూరిత వాగ్దానాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని బండి సంజయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పార్లమెంటరీ కన్వీనర్ ప్రవీణ్‌రావు, కో కన్వీనర్ అడెపు రవీందర్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల సంతోష్, జిల్లా ఉపాధ్యక్షులు శీలం రాజు, గరిపెల్లి ప్రభాకర్, అన్నల్‌దాస్ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

ధర్మపురి క్షేత్రంలో భక్తుల సందడి



స్వామి వారిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

ధర్మపురి, ఆగస్టు 18: ధర్మపురి క్షేత్రంలో ఆదివారం భక్త జన సందడి నెలకొంది. శ్రావణ మాసం పురస్కరించుకుని స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. దూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు గోదావరి నదిలో స్నానాలు చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులు అభిషేకం, అర్చన, హోమం, నిత్య కళ్యాణం టిక్కెట్లు కొనుగోలు చేసి పూజలు చేయించారు. అంతకు ముందు అనుబంధ ఆలయాల్లో వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం

- టీఉద్యోగుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్




మాట్లాడుతున్న మారం జగదీశ్వర్

జగిత్యాలరూరల్, ఆగస్టు 18: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తున్నామని టీ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్ అన్నారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రానికి వచ్చిన జగదీశ్వర్‌ను పట్టణంలోని సంఘ కార్యాలయంలో పలువురు అసోసియేషన్ సభ్యులు, నాయకులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం దిశగా కార్యాచరణ రూపకల్పనకు 15 మందితో రాష్ట్ర స్థాయిలో స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగుల స్నేహపూర్వక సర్కారు అని చెప్పి చివరకు సంఘాలను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. కనీసం ఒకటవ తేదీన వేతనాలను సైతం అందివ్వలేదని ఆరోపించారు. కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు, పెన్షనర్లకు ఒకటవ తేదీననే వేతనాలు, పెన్షన్లు అందిస్తుండడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. పెండింగ్ డీఏలు, పీఆర్సీ అమలు, నగదు రహిత వైద్య సేవలు, 317 జీవో, సీపీఎస్ రద్దు, ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు నిబంధనల అమలు, పెన్షనర్లకు డైరెక్టరేట్ ఏర్పాటు వంటి 36 సమస్యల పరిష్కారానికి పోరాడుతున్నామన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యలను ఆయన దృష్టికి తీసుకవెళ్ళుతామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్, కందుకూరి రవి బాబు, వొడ్నాల రాజశేఖర్, బైరం హరి కిరణ్, వెల్మల ప్రకాశ్‌రావు, రవిచంద్ర, రవీందర్, మమత, రాజేశం, సుగుణాకర్, మధుకర్, మహమూద్, భువనేశ్వర్, కుమార స్వామి, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఎండీకి తగ్గిన ఇన్‌ఫ్లో

తిమ్మాపూర్, ఆగస్టు 18: కరీంనగర్ పరిధిలోని దిగువమానేరు జలాశయంలోకి వస్తున్న ఇన్‌ఫ్లోలు ఆదివారం సాయంత్రానికి తగ్గాయి. రెండు, మూడు రోజులుగా ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా మోయతుమ్మెద వాగు నుంచి ఎల్ఎండీలోకి వస్తున్న ఇన్‌ఫ్లో పెరిగింది. కాగా వర్షాలు లేకపోవడంతో పై నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోలు తగ్గాయి. శనివారం ఉదయం 1,190క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నీరు ఎల్ఎండీలోకి వస్తుండగా సాయంత్రానికి 1,551క్యూసెక్కులకు పెరిగింది. ఆదివారం ఉదయం ఇన్‌ఫ్లో 2,197క్యూసెక్కులకు పెరిగింది. సాయంత్రం 6గంటల ప్రాంతంలో కేవలం 707 క్యూసెక్కులకు తగ్గిపోయింది. ఎల్ఎండీ పూర్తి స్థాయి నీటి మట్టం 24.034 టీఎంసీలు కాగా ఆదివారం సాయంత్రం 5.723టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.



ఎల్ఎండీలో ఉన్న ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు

గంజాయి కిట్ల సహాయంతో ఆరుగురు నిందితుల అరెస్ట్

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 18: గంజాయి కిట్ల సహాయంతో జిల్లా వ్యాప్తంగా ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశామని ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదివారం తెలిపారు. రెండు రోజుల వ్యవధిలోనే వీరి వద్ద నుంచి 600 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయికి అలవాటు పడి తాగేవారు జాగ్రత్తగా ఉండాలన్నారు. గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి విస్తృత కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగానే ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, గంజాయి రవాణాపై స్పెషల్ డ్రైవ్‌లు, నార్కోటిక్ జాగిలాలతో తనిఖీలు చేపడుతూ గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. జిల్లాలో విస్తృతంగా గంజాయి కిట్ల సహాయంతో టెస్ట్‌లు చేస్తూ గంజాయి సేవించే వారిని అదుపులోకి తీసుకుంటున్నామన్నారు. సిరిసిల్లలో ఇద్దరు నిందితులైన ఒల్లెపు వంశీ, భీంరాజ్‌లను అదుపులోకి తీసుకొని 200 గ్రా ముల గంజాయిని, కోనరావుపేటలో ఇద్దరు నిందితులైన అరుణ్, అజ్మీర్‌వికాస్‌ల వద్ద 200 గ్రాముల గంజాయిని, తంగళ్లపల్లిలో ఇద్దరు నిందితులైన సాయి, సాగర్‌ల వద్ద 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని ఆరుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

25న సైక్లింగ్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు



మాట్లాడుతున్న సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ డాక్టర్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 18: జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25న జిల్లా రోడ్ సైక్లింగ్ జట్ల ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నామని సైక్లింగ్ అసోసియేషన్ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ పాఠశాలలో ఆదివారం అసోసియేషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సైక్లింగ్‌కు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉందని, సైక్లింగ్‌తో ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా ఎదుగుతారని అన్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని వెలిచాల బైపాస్ రోడ్డులో 25న అండర్-14, 16, 18, 23, ఆపై వయస్సు విభాగాల్లో బాల బాలికలకు పోటీలు నిర్వహించి జిల్లా జట్లను ఎంపిక చేయనున్నామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ స్వంత సైకిల్‌తో హాజరుకావాలన్నారు. సమావే శంలో సంఘం అధ్యక్షుడు డాక్టర్ జి.మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి వేణుగోపాల్, సభ్యులు రమేశ్, ఎస్.మనోహరాచారి, ఎస్.అన్వేష్, ఎస్ రాజయ్య, సత్యం తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలకు స్పందన



బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు18: జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లా యూత్ బాల బాలికల బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలకు విశేష స్పందన లభించింది. జిల్లా కేంద్రంలోని టీజీఎస్‌పీడీసీఎల్ బాస్కెట్‌బాల్ మైదానంలో నిర్వహించిన ఈ పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 40 మంది బాలురు, 30 మంది బాలికలు హాజరై ప్రతిభ చాటారు. వీరిలో విశేష ప్రతిభ చాటిన 18 మంది బాలురు, 18 బాలికలను ఈనెల 24వరకు అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించే శిక్షణ శిబిరానికి ఎంపిక చేశారు. జిల్లా పోటీల నిర్వహణను జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి బి అనంతరెడ్డి పర్యవేక్షించారు. సీనియర్ క్రీడాకారులు, పీడీలు శ్రీధర్‌రావు, సునీల్‌కుమార్, దూడ సత్యానందం, అరుణ్‌తేజ, జీవన్‌కుమార్, వెంకటేష్, జాయ్ అనిల్, పర్మిత్‌కౌర్, అభి, జోయల్, హెన్రీ, శివకుమార్ పాల్గొన్నారు.

అల్లుడిపై మామ దాడి

- బండరాయితో తలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతి

జూలపల్లి, ఆగస్టు 18: మండలంలోని కాచాపూర్ గ్రామంలో ఆదివారం అల్లుడిపై మామ దాడిచేశాడు. తలపై రాడ్‌తో కొట్టడంతో అల్లుడైన జేజేల అశోక్ అలియాస్ చెత్తయ్య(40) మృతిచెందాడు. జూలపల్లి ఎస్ఐ శ్రీధర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాచాపూర్ గ్రామానికి చెందిన జాడి కనుకయ్య తన అల్లుడైన అదే గ్రామానికి చెందిన అశోక్‌ను ఆదివారం మధ్యాహ్నం విందు ఇస్తానంటూ ఇంటికి పిలిపించుకున్నాడు. ఇంట్లో ఉన్న రాడ్‌తోపాటు బండరాళ్లతో అశోక్ తలపై కనుకయ్య బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పదేళ్లుగా తన భార్యతో అశోక్ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడన్న అనుమానంతో కనుకయ్య ఈ హత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, నలుగురు కూతుళ్లు ఉన్నారు. మృతుడి కూతురు జేజేల శారద ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు ..ఒకరికి తీవ్ర గాయాలు

మల్యాల, ఆగస్టు 18: జగిత్యాల-కరీంనగర్ మార్గంలోని నూకపల్లి వరదకాలువ బ్రిడ్జి వద్ద మహారాష్ట్ర నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న ఓ వ్యక్తిని కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాల పాలు అయ్యాడు. కారు ఢీకొని వేగంగా ముందుకు దూసుకెళ్లగా పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా పట్టుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గూడెంకు చెందిన జనగాం బాలగౌడ్ అనే వ్యక్తి మహారాష్ట్ర నుంచి తన ద్విచక్రవాహనంపై తన స్వగ్రామం గూడెంకు వస్తుండగా వరదకాలువ బ్రిడ్జి వద్ద కారు ఢీకొట్టి వెళ్లింది. దీంతో కింద పడిన అతని ఎడమ కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని స్థానికులు చికిత్స కోసం జగిత్యాలకు 108లో తరలించారు. ఢీకొని వెళ్లిన కారు కోసం ఎస్సై నరేష్‌కుమార్, పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీలు పరిశీలించారు. రెండు గంటల వ్యవధిలోనే వేములవాడ సమీపంలో కారును పట్టుకున్నారు. కారును స్వాధీనం చేసుకొని కారు నడిపిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య

వేములవాడ రూరల్, అగస్టు 18: పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం చెక్కపల్లి గ్రామానికి చెందిన గీస శిరీష (20) డిగ్రీ పూర్తి చేసుకుని ఇంట్లో కుట్టుమిషన్ పనులు చేసుకుంటుంది. ఆదివారం ఉదయం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ శిరీష ఆదివారం రాత్రి మృతి చెందింది. శిరీష తండ్రి గీస లచ్చయ్య జీవనోపాధికై గల్ఫ్‌కు వెళ్లాడు. గ్రామానికి చెందిన ఇద్దరు యువకుల వేధింపుల వల్లే తన చెల్లి ఆత్మహత్య చేసుకుందని మృతురాలి అన్నయ్య గీస శ్రీకాంత్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

రెండేళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన వ్యక్తి

- గుర్తించిన పోలీసులు

కోనరావుపేట, ఆగస్టు 18: రెండు సంవత్సరాల క్రితం ఇంటి నుండి వెళ్లిపోయిన వ్యక్తిని ఆదివారం గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు సీఐ వేంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం గోవిందరావుపేట తాండకు చెందిన బానోతు నరేష్ అనే వ్యక్తి 2022 సంవత్సరంలో కుటుంబ సమస్యల కారణంగా ఎవరికి చెప్పకుండా ఇంటి నుండి వెళ్లి పోయాడు. ఈ విషయమై కుటుంబ సభ్యులు కోనరావుపేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా నరేష్ గురించి ఎలాంటి ఆచూకీ తెలవకపోవడంతో చందుర్తి సర్కిల్ సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎస్ఐ శేఖర్ రెడ్డి సిబ్బందితో టీం ఏర్పాటు చేసి సాంకేతికత ఆధారంగా హైదరాబాద్‌లో ఓ హోటల్‌లో పని చేస్తున్నాడని తెలుసుకొని అక్కడికి సీఐ వెంకటేశ్వర్లు సిబ్బందిని పంపించి సమాచార సేకరించారు. బానోతు నరేష్‌తో సీఐ మాట్లాడగా తన కుటుంబ కలహాలు వల్ల ఇంటి నుంచి వెళ్లిపోయానని తెలిపాడు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శేఖర్‌రెడ్డిని ఎస్పీ అభినందించారు.

కొండగొర్రె మాంసం స్వాధీనం

గంభీరావుపేట, ఆగస్టు 18: గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామ శివారు ప్రాంతంలో కొండ గొర్రెను చంపిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కల్పనదేవి ఆదివారం తెలిపారు. అటవీ ప్రాంతంలో బండలు కొడుతున్న షరీఫ్, యాకూబ్ అనే వ్యక్తులు అటుగా వెళుతున్న కొండగొర్రెను రాళ్లతో కొట్టి చంపేశారు. చనిపోయిన కొండ గొర్రెను వండుకునే సమయంలో డీఆర్‌వో అంజలి పక్కా సమాచారంతో సిబ్బందితో వెళ్లి గొర్రె తలకాయ, కాళ్లు, మాంసాన్ని స్వాధీనం చేసుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. కొండ గొర్రెను చంపిన వారిని పట్టుకున్న డిప్యూటీ రేంజ్ అధికారి అంజలి, బీట్ ఆఫీసర్ రమేష్‌ను ఎఫ్ఆర్‌వో అభినందించారు. షరీఫ్, యాకూబ్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎఫ్ఆర్‌వో కల్పనదేవి తెలిపారు.

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి

కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ఆదివారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 8791 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరులోకి రెండు మోటార్ల ద్వారా 6300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీకి, హైదరాబాద్, ఆయా నియోజకవర్గాల ప్రజల తాగునీటి అవసరాల కోసం 452 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 14.560 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

- మిడ్ మానేరు నుంచి..

బోయినపల్లి: మిడ్ మానేరు ప్రాజెక్టులోకు ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 6,300 క్యూసెక్కుల, మూల వాగు నుంచి 2930 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్ల గాను ప్రస్తుతం 312.65 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు గాను ప్రస్తుతం 15.76 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది. కాగా మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్ కు 3200, కుడి కాలువకు వంద క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.

- 'అన్నపూర్ణ'లోకి..

ఇల్లంతకుంట: ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లో నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో 2.14 టీఎంసీల నీరు చేరింది. మధ్యమానేరు ద్వారా 3,200 క్యూసెక్కుల నీటిని ఒక పంపు ద్వారా ఎత్తిపోస్తున్నారు. అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 3,300క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

గురుకులంలో సీటు ఇప్పిస్తానని మోసగించిన ఒకరిపై కేసు

మేడిపల్లి, ఆగస్టు 18: తన మిత్రుడికి ఎమ్మెల్యే తెలుసు అని నీ కొడుకుకు గురుకుల పాఠశాలలో సీటు ఇప్పిస్తానని చెప్పి మహిళ దగ్గర నుంచి రూ 35 వేలు తీసుకుని మోసగించిన వ్యక్తిపై పోలీసులు కేసనమోదు చేశారు. మేడిపల్లి మండలం రాజలింగంపేట గ్రామానికి చెందిన రేగుల రాజేందర్ అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన మహిళ కొడుకుకు వేములవాడ గురుకుల పాఠశాలలో సీటు ఇప్పిస్తానని రూ 35 తీసుకున్నాడు. తన మిత్రుడైన చందుర్తి మండలం కిష్టపేట గ్రామానికి చెందిన చిగురుల మల్లేశం ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్‌కు దగ్గర అని చెప్పి ఇద్దరు కలిసి మహిళ దగ్గర నుంచి డబ్బులు తీసుకున్నారు. కాగా ఆ తరువాత గురుకుల పాఠశాలలో ఫ్రీ సీటు వచ్చిందని తెలుసుకుని తనను మోసం చేశారని మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు.

మోరపల్లి బస్సు ఘటన పై కేటీఆర్ ట్వీట్

జగిత్యాలరూరల్, ఆగస్టు 18: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్- మోరపల్లి గ్రామ శివారుల మధ్యలో జరిగిన బస్సు ప్రమాదం పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 50 మంది ప్రయాణించాల్సిన బస్సులో 170 మంది ఎక్కారని, దాంతో మోరపల్లి వద్ద నిర్మల్ డిపో బస్సులో 170 మంది ప్రయాణిస్తున్న బస్సు వెనుక రెండు టైర్లు ఊడిపోయాయని, ఈ ప్రమాదంలో ఎవరు గాయపడకపోవడం అదృష్టమే అన్నారు. ఈసందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని ఘాటుగా విమర్శించారు. ఎందుకు అమాయక పౌరుల జీవితాలతో ఆడుకుంటున్నారని, బస్సుల సంఖ్యను పెంచాలని ఎప్పుడు ఆలోచిస్తారని, ప్రయాణికుల సంఖ్యను పరిమితం చేసే విషయంలో ఏదైనా భద్రత ప్రోటోకాల్ అనుసరిస్తున్నారా, అధికపనిచేసే డ్రైవర్లు, కండక్టర్లకు మీరు ఎలా పరిహారం చెల్లిస్తున్నారని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.



సోషల్‌మీడియా వేదికగా కేటీఆర్ చేసిన పోస్ట్

బిల్డింగ్ పైనుంచి పడిన బాలుడు చికిత్స పొందుతూ మృతి

వేములవాడ టౌన్, ఆగస్టు 18: బిల్డింగ్‌పై నుంచి పడి తలకు తీవ్రగాయాలైన బాలుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం వేములవాడ మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన నడిగొట్ల రాజేష్, లావణ్య దంపతుల కుమారుడు ప్రజ్వల్ (4) అనే బాలుడు నాలుగు రోజుల క్రితం కరీంనగర్‌లో తాము నివాసం ఉంటున్న బిల్డింగ్ పైనుంచి ప్రమాదవశాత్తు పడిపోయాడు. దీంతో కింద వున్న ఇనుప సీకులపై పడటంతో బాలుడి తలలో గుచ్చుకుని తీవ్రగాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం హైదారాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు.



ప్రజ్వల్(ఫైల్)

● ఆరెపల్లిలో విషాదం..

వేములవాడ మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన ప్రజ్వాల్ చికిత్స పొందుతూ మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అములుకున్నాయి. బాలుడి చికిత్స కోసం రూ 20 లక్షల ఖర్చు అవుతాయని సోషల్ మీడియాలో వైరల్ కావడంతో దాతలు స్పందించి విరాళాలు అందించారు. బాలుడి చికిత్స కోసం ఇప్పటి వరకు రూ 8 లక్షల వరకు ఖర్చు అయినట్లు బాధితులు తెలిపారు. కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

మరణిస్తూ ఐదుగురికి ప్రాణదానం

- రోడ్డు ప్రమాదంలో యువకుడి బ్రెయిన్‌డెడ్ - అవయవదానానికి కుటుంబసభ్యుల అంగీకారం

గంభీరావుపేట, ఆగస్టు 18: గంభీరావుపేట మండలం నర్మాలకు చెందిన ద్యానబోయిన నరేష్(27) రోడ్డు ప్రమాదానికి గురై బ్రెయిన్ డెడ్ అయ్యాడు. అవయవదాన ప్రాధాన్యాన్ని హైదరాబాద్ జీవన్ దాన్ సంస్థ, అపోలో వైద్యులు అవగాహన కల్పించారు. దీంతో పుట్టెడు దుఖంలో అవయవ దానం చేసేందుకు ఆ యువకుడి తల్లి అంగీకరించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గంభీరావుపేట మండలం నర్మాలకు చెందిన ద్యానబోయిన నర్సింలు, దేవలక్ష్మి దంపతులకు నరేష్, నవిత ఇద్దరు సంతానం. రెండేళ్ల కిందట నర్సింలు అనారోగ్యంతో మృతి చెందాడు. కుటుంబ భారం కొడుకు నరేష్ మీద పడటంతో తల్లిని, చెల్లిని వదిలి ఏడాది కిందటే గల్ఫ్ బాట పట్టాడు. చెల్లి పెళ్లి చేసి, తాను పెళ్లి చేసుకుంటానని ఇటీవలనే ఇంటికి వచ్చాడు. లింగన్నపేటలో తన మేనమామ మృతి చెందగా, లింగన్నపేటకు వెళ్లి వస్తూ ఈ నెల 13న రైస్‌మిల్ వద్ద నరేష్(27) రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రగాయాలపాలయ్యాడు. ముందుగా ఎల్లారెడ్డిపేట అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించారు. ఆరు రోజులుగా మృత్యువుతో పోరాడి శనివారం నరేష్ బ్రెయిన్ డెడ్ అయ్యాడు. జీవన్ దాన్ అవయవ దానం గురించి అవగాహన కల్పించగా నరేష్ తల్లి అవయవ దానానికి అంగీకరించింది. నరేష్ కళ్లు, గుండె, కాలేయం, ఊపిరితిత్తులు, మూత్రపిండాలను దానం చేసి ఐదుగురి జీవితాల్లో వెలుగులు నింపాడు. దీంతో తన కొడుకు భౌతికంగా లేపోయినా ఐదుగురికి పునర్జన్మ కల్పించిన ఆ మాతృమూర్తిని పలువురు అభినందించారు.



నరేష్ శవపేటిక వద్ద రోదిస్తున్న బంధువులు(ఇన్‌సెట్‌లో నరేష్(ఫైల్)

తీవ్ర గాయాలతో బ్రెయిన్‌డెడ్

● అవయవదానం చేసిన కుటుంబసభ్యులు

మల్యాల: ఎదురెదుగా ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి బ్రెయిన్‌డెడ్ కావడంతో కుటుంబసభ్యులు మృతుడి అవయవాలు దానం చేశారు. మల్యాల మండలం మద్దుట్లకు చెందిన ముస్కెల నరేందర్ (51)అనే రైతు తన వ్యవసాయ పొలం వద్దకు ద్విచక్రవాహనంపై వెళ్లి వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. దీంతో నరేంద ర్ తల, ముఖం తదితర చోట్ల తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం జగిత్యాలకు తరలించారు. అక్కడి నుంచి కరీంనగర్, హైదరాబాద్ తీసుకెళ్లారు ముఖం, దవడలకు తీవ్ర గాయాలు కాగ శస్త్ర చికిత్సలు చేశారు. తలకు అయిన తీవ్ర గాయాలతో రెండు రోజుల క్రితం బ్రెయి న్‌డెడ్ అయింది. దీంతో హైదరాబాద్‌లోని యశోధ ఆసుపత్రిలో కుటుంబసభ్యులకు అవయవదానంపై వివరించడం తో శనివారం రాత్రి కుటుంబసభ్యులు నరేందర్ కిడ్నీలు, గుండె, ఊపిరితిత్తులను దానం చేశారు. ఆదివారం మృతదేహం మద్దుట్లకు రాగ అంత్యక్రియలు పూర్తి చేశారు. మృతుని కుటుంబసభ్యులను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పరామర్శించారు



నరేందర్(ఫైల్)

ఆశీర్వాదాలు.. పరామర్శలు

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 18: సిరిసిల్ల పట్టణంలో ఆదివారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ పలు వివాహ శుభకార్యాలకు వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించడంతో పాటు పలువురు నాయకులను పరామర్శించారు. సిరిసిల్ల పట్టణంలోని తెలంగాణభవన్‌లో పనిచేసే గౌరీశంకర్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు రాపెల్లి రమేష్ కూతురు వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కౌన్సిలర్ గడ్డం లతభాస్కర్ మేనకోడలు వివాహం జరుగగా ఆ దంపతులను కూడా ఆశీర్వదించారు. అలాగే బీఆర్ఎస్ పార్టీలో పనిచేస్తూ అనారోగ్యంతో మృతిచెందిన ఈదులకంటి రత్నయ్య ఇంటికి వెళ్లి కుటుంబీకులను పరామర్శించారు. అలాగే ప్రభుత్వ ఉపాధ్యాయుడు బంటు బాలకిషన్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో చనిపోగా ఆయనను పరామర్శించారు. కార్యక్రమాల్లో జిల్లా అధ్యక్షుడు తోట అగయ్య, నాయకులు బొల్లి రామ్మోహన్, మ్యాన రవి, శంకర్, అందె సుభాష్ పాల్గొన్నారు.

యథేచ్ఛగా టేకు చెట్ల నరికివేత



నరికేసిన టేకు చెట్టు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 18: దట్టమైన అడవుల్లో గుట్టుగా అక్రమార్కులు తమ దందాను సాగుస్తున్నారు. నిర్భయంగా పచ్చని చెట్లను నేలకూల్చుతున్నారు. టేకు వృక్షాలను రంపంతో కోస్తూ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. దర్జాగా కలపను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డిపల్లి గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో టేకు చెట్లు అక్రమ వ్యాపారుల కన్నుసన్నల్లో నేలకూతున్నాయి. రంపంతో కోస్తూ ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. సుమారు 50 భారీ వృక్షాలను నరికేశారు. కొంత కాలంగా కొందరు వ్యక్తులు టేకు చెట్లను నరికేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మాల మహానాడు కార్యకర్తల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న మాల మహానాడు కార్యకర్తలు

గంభీరావుపేట, ఆగస్టు 18: మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఆదివారం మాల మహానాడు కార్యకర్తలు నిరసర వ్యకం చేశారు. ఎస్సీ వర్గీకరణ తీర్పు అప్రజాస్వామికమని రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. తీర్పును నిరసిస్తూ ఈ నెల 21న ఇచ్చిన దేశ వ్యాప్త భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం, నాయకులు దోసల శంకర్, రామచంద్రం, బాబు, శ్రీకాంత్, చంద్రం, నర్సింలు తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



2005-06 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు

కోనరావుపేట, ఆగస్టు 18: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో కలుసుకొని తమ తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కోనరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో 2005-06 సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థులు కలుసుకొని తమ అపూర్వ సమ్మేళనాన్ని పంచుకున్నారు.

రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు



భక్తులతో సందడిగా మారిన ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, ఆగస్టు 18: వేములవాడ రాజన్నకు భక్తులు మొక్కులు చెల్లించుకునేందుకు బారులు తీరారు. శ్రావణ మాసం రెండో ఆదివారం కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం, బ్రేక్‌దర్శనం క్యూలైన్‌లో భక్తులు ఆలయంలోకి ప్రవేశించి రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకుని పార్వతి పరమేశ్వరులను దర్శించుకుని తరించారు. రాజన్న ఆలయానికి సుమారుగా 20 వేలకుపైగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయాధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో వినోద్‌రెడ్డి ఆదేశాలతో ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, రమేష్‌బాబు, సూపరింటెండెంట్ తిరుపతిరావు, రాజన్‌బాబు, సీనియర్ అసిస్టెంట్ ఎడ్ల శివసాయిలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాజన్నను దర్శించుకున్న మహారాష్ట్ర రవాణా కమిషనర్

రాజరాజేశ్వరస్వామి వారిని మహారాష్ట్ర రవాణా కమిషనర్ వివేక్ భీమనవర్ ఆదివారం దర్శించుకున్నారు. కుటుంబసభ్యులతో కలిసి రాజన్న ఆలయానికి తరలివచ్చి స్వామివారి సేవలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించగా ఆలయ ఏఈవో రమేష్‌బాబు, సూపరింటెండెంట్ తిరుపతిరావు రాజన్నప్రసాదాన్ని అందజేశారు.



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

సర్వాయి పాపన్న జీవితం
నేటి తరానికి స్ఫూర్తిదాయకం

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- జిల్లా వ్యాప్తంగా ఘనంగా జయంతి వేడుకలు



కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న కలెక్టర్, తదితరులు

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 18: సమసమాజం కోసం, బలహీనవర్గాల హక్కుల కోసం పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. సిరిసిల్ల కలెక్టరేట్‌తో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలను ఆదివారం అధికారికంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా జిల్లా అధికారులు, జిల్లా గౌడ సంఘం నాయకులు పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ వీరత్వానికి ప్రతీకగా పాపన్నగౌడ్ నిలిచాడని అన్నారు. ఆనాటి సమాజంలో నెలకొన్న నిరంకుశ పోకడలకు వ్యతిరేకంగా సబ్బండవర్గాలను ఏకం చేసి సమసమాజ స్థాపనకు పాపన్నగౌడ్ పోరాటం చేసిన తీరు స్ఫూర్తిదాయకంగా నిలిచిందని అన్నారు. కార్యక్రమంలో బీసీ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి విజయలక్ష్మి, సర్వాయి పాపన్న మోకుదెబ్బ గౌడ సంఘం రాష్ట్ర యూత్ అధ్యక్షుడు తీగల శ్రావణ్‌గౌడ్, గౌడ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర నారాయణగౌడ్, కౌన్సిలర్ బొల్గం నాగరాజుగౌడ్, వంగ అనిల్‌కమార్‌గౌడ్, గుమ్మడి రాజశేఖర్, వంగ నరేష్, సాయికుమార్, సిరిసిల్ల పట్టణ గౌడ సంఘం అధ్యక్షులు బాలసాని అంజయ్యగౌడ్, విక్కుర్తి పర్శరాములుగౌడ్, పరకాల అంజయ్యగౌడ్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి పేట: సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు వెంకటాపూర్, బండలింగంపల్లి, గొల్లపల్లి, అల్మాస్‌పూర్ తదితర గ్రామాల్లోని గౌడ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన పోరాట ప్రతిమను కొనియాడారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, 'సెస్' డైరెక్టర్ కృష్ణహరి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, వివిధ పార్టీల నాయకులు, గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండల కేంద్రంతో పాటు సముద్రలింగాపూర్ తదితర గ్రామాల్లో సర్దార్ సర్వాయి పాపన్న చిత్ర పఠాలకు పూల మాలలు వేసి, ఆయన చేసిన సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో గౌడ సంఘం మండల అదక్షుడు చేరాల వెంకటస్వామి, ఉపాధ్యక్షుడు నిమ్మల తిరుపతి, గౌడ సంఘం నాయకులు పాప్పగారి వెంకటస్వామి, సుదర్శన్ గౌడ్, బంగ్ల రాజు, పర్శరాములు, నాగరాజు, శ్రీనివాస్‌గౌడ్, రాజేశం, శంకర్, అరవింద్, రామాంజగౌడ్, ఎల్లాగౌడ్, శేఖర్‌గౌడ్, రవిగౌడ్, అంజాగౌడ్, కిషన్‌గౌడ్, వేణుగోపాల్, దేవగౌడ్ తదితరులు ఉన్నారు.

సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడు, చంద్రంపేట, రాజీవ్‌నగర్, చిన్నబోనాల, పెద్దబోనాల, పెద్దూర్, సర్దాపూర్ గ్రామాలలో ఆదివారం సర్దార్ సర్వాయిపాపన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో గౌడ సంఘాల ఆధ్వర్యంలో సర్వాయిపాపన్న చిత్రపటానికి పూలమాలలు వేయడంతో పాటు కేక్ కట్‌చేసి స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో కౌన్సిలర్లు పోచవేని సత్యఎల్లయ్యయాదవ్, పాతూరి రాజిరెడ్డి, బుర్ర లక్ష్మి, బొల్గం నాగరాజుగౌడ్, లింగంపల్లి సత్యనారాయణ, కల్లూరి లతమధు, చెన్నమనేని కీర్తి, కో అప్షన్‌సభ్యులు గొల్లపల్లి బాలయ్యగౌడ్, గుగ్గిళ్ల అజయ్‌గౌడ్, నేరేళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ అదిపెల్లి దేవయ్యగౌడ్, అదిపల్లి నారాయణగౌడ్, మాజీ ఎంపీటీసీ బుర్ర మల్లికార్జున్‌గౌడ్, సల్లూరి తిరుపతిగౌడ్, వంగ అనిల్‌కుమార్‌గౌడ్, చెరుపల్లి పర్శరాములుగౌడ్, గుర్రం భూమయ్య, నేరేళ్ల సంతోష్, గుర్రం అంజనేయులు, గుర్రం లచ్చయ్య, గుర్రం తిరుపతి పాల్గొన్నారు.



కందికట్కూర్ గ్రామంలో పాల్గొన్న నాయకులు

ఇల్లంతకుంట: సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. కందికట్కూర్ గ్రామంలోని బస్టాండ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్న విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గౌడసంఘ అధ్యక్షుడు తీగల రవీందర్‌గౌడ్, మాజీ సర్పంచ్ ముత్యం అమర్, మాజీ ఎంపీటీసీ డొమ్మాటి కిషోర్, నాయకులు బత్తిని విప్లవ్, చెక్కిల్ల లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండల కేంద్రంలో తెలంగాణ కల్లుగీత వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో గుగ్గిళ్ల శ్రీకాంత్‌గౌడ్ అధ్యక్షతన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లెల్లలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ప్యాక్స్ చైర్మన్ కోడూరి బాస్కర్‌గౌడ్, నాయకులు పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సారంపల్లిలో గౌడ సంఘం అధ్యక్షుడు కోల బాలమల్లు, కొయ్యడ రమేష్, గుగ్గిళ్ల అంజయ్య, గుగ్గిళ్ల భరత్ గౌడ్ పాపన్న గౌడ్ విగ్రహానికి నివాళులు అర్పించారు. కస్బెకట్కూర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో నాయకులు పొన్నం లక్ష్మణ్‌గౌడ్, కందుకూరి రామాగౌడ్, బండి దేవదాస్‌గౌడ్, కొత్త రవీందర్ గౌడ్, బాలసాని శ్రీనివాస్‌గౌడ్, బండి సత్తయ్య, బొల్గం రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



వీర్నపల్లిలో..

వీర్నపల్లి: మండల కేంద్రంలో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డైరెక్టర్ మల్లేశం, మాజీ సర్పంచ్ దినకర్, గౌడ కులస్తులు వినోద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలోని సుద్దాల, నిజామాబాద్, బావుసాయిపేట గ్రామాల్లో గౌడ సంఘాల ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గౌడ సంఘం నాయకులు కచ్చకాయల బాల్‌రెడ్డి, ఎర్రవెల్లి నాగరాజు, బుర్ర రమేష్, కచ్చకాయల మహేష్, ఉప్పుల శంకర్, ఎర్రవెల్లి విజయ్, వంగల శ్రీనివాస్, బైరగోని సురేష్, మధు యాదవ్, రాజేశం గౌడ్, శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ రూరల్: మండలంలోని మరిపల్లి, హన్మాజీపేట, ఫాజుల్ నగర్ గ్రామాల్లో సర్వాయి పాపన్న చిత్రపటానికి గౌడ సంఘం సభ్యులు, పలువురు నాయకులు, పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రంగు వెంకటేశం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వకుళాబరణం శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం హనుమండ్లు, సంఘం నాయకులు తీగల రాములు, మిద్దె శ్రీనివాస్, సుదగోని రాజమల్లు,తీగల లింగయ్య, బత్తిని ఎల్లాగౌడ్, తీగల ప్రశాంత్, జాగిరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న గౌడ్ జీవితం ఆదర్శనీయం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ: బడుగు, బలహీన వర్గాల ప్రజలను వేధించిన వారిపై పోరాటం చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం ఆదర్శనీయమని వేములవాడ శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం నాడు వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండ్ ప్రాంతంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కూడలిలో ఉన్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి ఆది శ్రీనివాస్ స్థానిక నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేద, బడుగు బలహీనవర్గాలపై జరిగిన అన్యాయాల పైన పోరాటం చేసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి, వైస్ చైర్మన్ బింగి మహేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, గౌడ సంఘం నాయకులు నేరెళ్ల తిరుమల్ గౌడ్, పులి రాంబాబు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి: పేద ప్రజల కోసం వీరోచిత పోరాటం చేసిన గొప్ప పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న నేటి తరానికి ఆదర్శ మన్నారు. చందుర్తి మండలం ఎనగల్ గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా పాపన్న విగ్రహాన్ని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నాగం కుమార్, పొద్దుపొడుపు లింగారెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు ఎనగంటి శంకర్, లింగంపల్లి సత్తయ్య, గౌడ కుల సంఘం అధ్యక్షులు గడ్డం సత్తయ్య, గౌడ సంఘం నాయకులు జవ్వాజి రామస్వామి, గడ్డం దేవయ్య, గడ్డం నారాయణ, నాయకులు ల్యాండే తిరుపతి, గసికంటి ప్రభాకర్, ఏలియా, ప్రణయ్, కుల సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



జయంతి వేడుకల్లో పాల్గొన్న ఆది శ్రీనివాస్, నాయకులు

ఒక్క క్షణం..ఆనంద వీక్షణం

- అనుబంధాలకు వారధిగా ఫొటోగ్రఫీ
- నేడు ఫొటోగ్రఫీ డే

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ప్రకృతిని... అందచందాలు చెప్పేందుకు... కవులకు బోలెడు మాటలు... ఏన్నో.. అక్షరాలు.. మరేన్నో వాక్యాలు కావాలి... కానీ కెమెరా కన్ను వాటిని ఒక ఫొటో ఆవిష్కరిస్తుంది. హృదయాన్ని ప్రభావితం చేస్తుంది. ప్రకృతి అందాలనే కాదు.. ప్రకృతి అగ్రహావేశాలు, కోపతాపాలు, పెళ్లి, పుట్టిన రోజులు, సంతోష క్షణాలు, సంతోష జ్ఞాపకాలు, మానవ వికాసానికి నిదర్శనంగా నిలిచే అద్భుత కట్టడాలను ఇలా ఎన్నెన్నో పదిల పరిచి అందించేది ఫొటో. మానవ విజ్ఞానం అందించిన శాస్త్ర సాంకేతిక రంగంలో చాయ చిత్రం మొదటి వరుసలో నిలుస్తుంది. మెరుపు మెరిస్తే వాన కురిస్తే.. ఆకసాన హరివిల్లు విరిస్తే... అది మీకే అని ఆనందించే కూనల్లారా... అని అన్నట్లుగానే ఫోటోలు చూస్తే ఎంత పెద్దవాళ్లయిన చిన్న పిల్లలుగా మారి పోతారు. పండిత పామరులకు అర్థమయ్యే రీతిలో ఒక ఫోటో చిత్రం చెబుతుంది. అలాంటి జ్ఞాపకాలను పదిల పరిచే ఫోటోకు కూడా పండగ ఉంది. 19న ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా చాయ చిత్ర ప్రపంచం గురించి తెలుసుకోవాలనే ఆసక్తి అందరిలోనూ ఉంటుంది. మనలో కూడా ప్రతి ఒక్కరికి ఫోటోలు తీయాలనే తపన ఉంటుంది. అందుకు అనుగుణంగా ప్రస్తుత కాలంలో ప్రతి ఇంట్లో రీల్ కెమెరాలతో పాటు డిజిటల్ కెమెరాల వరకు దర్శనమిస్తున్నాయి. అంతేకాకుండా మొబైల్ ఫోన్‌లలో కూడా కెమెరాలు రావడంతో ఎక్కడ సుందర దృశ్యం కనిపించినా... ఏ సంఘటన కండ్ల ముందు కదలాడినా బంధించి వేస్తున్నారు. దాదాపు 178 సంవత్సరాల క్రితం ప్రారంభమైన ఛాయచిత్ర ప్రస్థానం ఎన్నో మార్పులు చెందింది. ఈ క్రమంలోనే ఫొటోగ్రాఫర్‌లు సృజనాత్మకతవైపు దృష్టి సారించారు.

● **ఫొటోగ్రఫీ ఎలా వచ్చింది...**

కాలం ఆగి పోయినా... మనిషి లేకపోయినా మన ముందు ఆనాటి జ్ఞాపకాలను నిలిపే ఫొటోగ్రఫీ ఆద్యుడు డాగురే. 1925 సంవత్సరం నాటి నుంచి ఫొటోగ్రఫీపై చాలారకాల పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. ఫ్రెంచ్ దేశస్థుడు డాగురే అనే వ్యక్తి ఒకరకమైన ఫొటోగ్రాఫిక్ ప్రాసెస్ కనిపెట్టి ఫొటో లను తీసి చూపించాడు. దీంతో ఆర్ట్స్ అండ్ సైన్సెస్ అకాడమీ వారు అతనికి సన్మానం చేశారు. ఈ క్రమంలోనే ఫొటోగ్రఫీ ప్రాసెస్ గురిండి డాగురే ప్రపంచా నికి చాటాడు. అది ఆగస్టు 18-1939 సంవత్సరంలో జరిగింది. ఆగస్టు 19 నాటికి ప్రపంచ మంతా తెలిసిపోయింది. దాంతో ఆగస్టు 19ని ఫొటోగ్రఫీ డేగా జరుపుకుంటున్నారు.



సిరిసిల్లకు చెందిన శేఖర్ తీసిన ఫొటో

● **సిరిసిల్లలో ఫొటోగ్రఫీ కోర్సులు**

ఫొటోగ్రఫీ ద్వారా కూడా విస్తృత అవకాశాలున్నాయి. వివిధ కంపెనీలకు ఫోటోగ్రాఫర్లు అవసరం ఉండగా, పత్రికల్లో ఫొటోగ్రాఫర్లుగా, సినిమా స్టూడియోల్లో కూడా అవకాశాలున్నాయి. ఫొటోగ్రఫీ కోర్సులు కూడా లభిస్తున్నాయి. జేఎన్‌టీయూలో బ్యాచిలర్స్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వెంకటేశ్వర ఫైన్ ఆర్ట్స్ కళాశాల, లకోటియా ఫ్యాషన్ ఇన్‌స్టిట్యూట్, జేఎన్‌టీయూలో విజువల్ కమ్యూనికేషన్‌లో శిక్షణ, అంతేకాకుండా ప్రైవేటు సంస్థలు ఆన్‌లైన్‌ల ద్వారా కూడా కోర్సులు అందిస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లిలో గిరిజన ఫైన్ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు ఫొటోగ్రఫీ కోర్సులను కూడా అందిస్తున్నారు. సంస్కృతి.. జీవనం.. చరిత్ర ఇలా అనేక అంశాలను పదిల పర్చుకోవడానికి ఫొటోగ్రఫీ దోహదపడుతంది. ఆడవుల్లో పకృతి ఒడిలో జీవనం సాగిస్తున్న గిరిజనుల శైలిని ఎంసీ శేఖర్ తన కమెరాలో బందిస్తూ అంతర్జాతీయ ఖ్యాతిని పొందారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఆదివాసీల జీవన శైలిని, వారి బతుకు చిత్రాలను తన కెమెరాలో బంధించాడు. తెలంగాణ చారిత్రక ఘట్టాలను తన కెమెరాలో బంధించాడు. ఫొటోగ్రఫీ రంగంలో ఖండాంతరాలు దాటిన సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన శేఖర్ అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులను అందుకున్నారు. సిరిసిల్లలో సిగ్మా ఫొటో స్టూడియోతో చాయచిత్ర రంగంలో అడుగు పెట్టిన మేర్గు శేఖర్ అంతర్జాతీయ స్థాయిలో వరుసగా అనేక అవార్డులను అందుకోవడంతోపాటు అతని ఫోటోలతో పలు దేశాల్లో ప్రదర్శనలు కూడా నిర్వహించారు. ఎన్నో పురస్కారాలను దక్కించుకున్నాడు.

తప్పిపోయిన బాలుడు.. తల్లిదండ్రులకు అప్పగింత



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

వీర్నపల్లి, ఆగస్టు 18: మండలకేంద్రంలో ఆదివారం సంతలో బాబాయిచెర్వు తండా గ్రామానికి చెందిన 8 సంవత్సరాల బాలుడు బట్టు నరహరి తప్పిపోయాడు. తల్లిదండ్రులు సంతలో గాలించిన కొడుకు దొరకక పోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక ఎస్ఐ ఎల్లాగౌడ్ ఆదేశాలతో బ్లూకోల్ట్స్ పోలీసులు బాలుడి ఆచూకీ కనుక్కొని ఆదివారం రాత్రి తల్లిదండ్రులకు అప్పగించారు. తన కొడుకు ఆచూకీ తెలుసుకున్న బ్లూ కోల్ట్స్ పోలీసులు రియాజ్, మోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

కోనరావుపేట, ఆగస్టు 18: ఈ నెల 21న హైదరాబాదులో సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కు ఇవ్వాలనే ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని అన్నారు. ఈ నెల 21న చలో హైదరాబాదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ అధ్యక్షురాలు జవ్వా జి విమల, మధ్యాహ్న భోజన నిర్వాహకులు బాలమణి పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం రాష్ట్ర ఎన్నికలు

సిరిసిల్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పద్మశాలీ సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నికలకు సంబంధించి అధ్యక్షుని ఎన్నికకు ఆదివారం సిరిసిల్ల, వేములవాడ రెండు పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 1964 మంది ఓటర్లు ఉండగా 646 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్నికల అధికారిగా చౌకి కమలాకర్ వ్యవహరించారు.

నూతన జంటను ఆశీర్వదించిన కేంద్ర సహాయ మంత్రి

వేములవాడ, ఆగస్టు 18: వేములవాడ రూరల్ మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు బండ మల్లేశం యాదవ్ కుమార్తె హైమావతి-సృజన్ యాదవ్ దంపతులను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆశీర్వదించారు. హైమావతి- సృజన్ యాదవ్ వివాహం ఆదివారం నాడు వేములవాడ పట్టణంలోని ఎస్సార్ఆర్ గార్డెన్స్‌లో జరిగింది. వివాహ వేడుకకు హాజరైన కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ నూతన జంటను ఆశీర్వదిం చారు. స్థానిక శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, బీజేపీ నేత వికాస్ రావు తదితరులు నూతన జంటను ఆశీర్వదించారు.

మున్సిపల్ నుంచి మా వార్డుకు విముక్తి కల్పించాలి

- నిరసన తెలిపిన జేఏసీ నాయకులు, గ్రామస్థులు

సిరిసిల్ల రూరల్, అగస్టు 18: సిరిసిల్ల మున్సిపల్‌లో విలీనం చేసిన గ్రామాలకు రాష్ట్ర ప్రభుత్వం విముక్తి కల్పించి పాత గ్రామపంచాయితీలు మార్చి గ్రామీణా ప్రాంతాల ప్రజలకు న్యాయం చేయాలని విలీన గ్రామాల ఐక్యవేదిక నాయకులు సలేంద్రి బాలరాజుయాదవ్, బెజ్జారపు చందుగౌడ్, వంగ అనిల్‌కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేట గ్రామంలో ఆదివారం జేఏసీ అధ్వర్యంలో గ్రామస్థులు, నాయకులు కలిసి ర్యాలీ నిర్వహించి వార్డు కార్యాలయం ఎదుట వార్డులుగా మార్చిన గ్రామాలను తిరిగి గ్రామపంచాయతీలుగా మార్చాలంటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిరిసిల్ల అర్బన్ మండలంగా మార్చిన ఏడు గ్రామాలను తిరిగి సిరిసిల్ల మున్సిపాలిటీలో విలీనం చేసిన తరువాత గ్రామాల్లో కూలీలకు ఉపాధిహామీ పథకంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమపథకాలకు దూరమైపోయారన్నారు. ఎలాంటి ఉపాధి లేకుండాపోవడంతో సిరిసిల్లలో అడ్డామీదాకూలీలకు పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. విలీనం చేసిన గ్రామాలను తిరిగి గ్రామపంచాయితీలుగా మార్చాలంటూ జేఏసీ అధ్వర్యంలో అందోళనలు చేస్తున్న క్రమంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్బంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే విలీన గ్రామాలను తిరిగి గ్రామపంచాయితీలుగా మార్పు చేయిస్తానని హామీ ఇచ్చారన్నారు. సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ సైతం విలీన గ్రామాలను గ్రామపంచాయతీలుగా మార్పు చేస్తానని చెప్పారన్నారు. దీంతో మున్సిపల్ సమావేశంలో విలీనం చేసిన రగుడు, చంద్రంపేట, ముష్టిపల్లిరాజీవ్‌నగర్, చిన్నబోనాల, పెద్దబోనాల, పెద్దూర్, సర్దాపూర్ గ్రామాలను తిరిగి గ్రామపంచాయితీలుగా మార్చాలంటూ తీర్మాణం చేసి ప్రభుత్వానికి పంపించడం జరిగిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ విప్ స్పందించి ఏడు గ్రామాలను గ్రామపంచాయతీలుగా మార్చి ప్రజల కష్టాలను తీర్చాలని కోరారు. కార్యక్రమంలో మందాడి బాస్కర్‌రెడ్డి, అనవేణి బాలయ్య, కాంబోజుశ్రీధర్, అబ్బగోని శ్రీనివాస్‌గౌడ్, కాంభోజు హరికృష్ణ, పసుల సతీష్, కోలగాని అంజయ్య, మెరుపుల రాజు, మరువారి రాకేష్, కత్తెర పాక సంతోష్, అబ్బగోని లచ్చయ్య, మ్యాన అజయ్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్థులు